క్లుప్తంగా

ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ

తర్లుపాడు: ఈనెల 22 నుంచి జూన్ 21 వరకు 30 రోజులపాటు పురుషులకు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం పిచ్చయ్య ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి చెందిన వారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డుతో 82473 87644, 94925 83484ను సంప్రదించాలని సూచించారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి ఉచితంగా కల్పిస్తామన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బేస్తవారిపేట: మండలంలోని అక్కపల్లె 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ సన్యాసిరావు తెలిపారు. మోక్షగుండం, పందిళ్లపల్లె, పెంచికలపాడు, పూసలపాడు గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

వేడుకగా శివపార్వతుల కల్యాణం


ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవస్వామి

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పార్వతీ సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం, నందిసేవ కార్యక్రమాలతో పాటు చెన్నకేశవస్వామి కల్యాణం నిర్వహించారు. ఉభయ దాతలుగా నగరంశెట్టి, దమ్మాలపాటి, బొడ్డపాటి, గోపిశెట్టి కుటుంబాలకు చెందిన దంపతులు వ్యవహరించారు. వేదపండితులు నంద్యాల వెంకటకృష్ణకిరణ్, నుదురుపాటి వెంకటకృష్ణారావు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేసి కల్యాణాన్ని జరిపించారు. ఆదివారం రథోత్సవం, సోమవారం వసంతోత్సవం, మంగళవారం ఏకాంతసేవ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయిని దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా కుంభాభిషేక మహోత్సవం


హోమంలో పాల్గొన్న దంపతులు

త్రిపురాంతకం: శ్రీకోదండరామస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా కుంభాభిషేక మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. త్రిపురాంతకం కోదండరామస్వామి వారి ఆలయంలో రెండు రోజులుగా 12వ వార్షికోత్సవ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తున్నారు. భక్తులతో గణపతి హోమం, నవగ్రహ హోమం, శాంతి హోమం, శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం భక్తులచే పండితులు వైభవంగా జరిపించారు. అనంతరం అన్నదానం చేశారు.

బైక్ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన లూసమ్మ

బేస్తవారిపేట: గుర్తు తెలియని బైక్ ఢీకొట్టడంతో ఓ మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన బేస్తవారిపేటలోని పాత సినిమా హాల్ సెంటర్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పాత సనిమాహాల్ సెంటర్ సమీపంలోని ఎస్సీ కాలనీకి చెందిన దార్ల లూసమ్మ ఇడ్లీ, పాల ప్యాకెట్ కొనుగోలు చేసి హైవే రోడ్డు దాటుతున్న సమయంలో రాంగ్ రూట్‌లో వచ్చిన బైక్ ఢీకొట్టింది. తల, కాళ్లకు తీవ్ర గాయాలైన లూసమ్మ రోడ్డుపై అచేతనంగా పడిపోయింది. వెనుక భాగంలో టీడీపీ గుర్తు ఉన్న గ్లామర్ మోటార్‌సైకిల్ ఢీకొట్టిందని స్థానిక యువకులు చెబుతున్నారు. ఢీకొట్టిన వ్యక్తి మోటార్‌సైకిల్‌ను ఆపకుండా వెళ్లిపోయాడు. క్షతగాత్రురాలిని 108 అంబులెన్స్‌లో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


బేస్తవారిపేటలో మాట్లాడుతున్న సీఐ రామకోటయ్య


మాట్లాడుతున్న ఎస్సై కోటయ్య

హద్దు మీరితే కఠిన చర్యలు

- గిద్దలూరు, మార్కాపురం సీఐల హెచ్చరిక


మాట్లాడుతున్న మార్కాపురం సీఐ వెంకటేశ్వర్లు, పక్కన ఎస్సై నాయక్


కొమరోలులో మాట్లాడుతున్న గిద్దలూరు సీఐ దాసరి ప్రసాద్

కొమరోలు : ఎన్నికల సందర్భంగా ఎవరైనా హద్దుమీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని గిద్దలూరు సీఐ దాసరి ప్రసాద్ హెచ్చరించారు. కొమరోలులోని పోలీసు స్టేషన్‌లో శుక్రవారం మండలంలోని ఇరు రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నపాటి గొడవ జరిగినా కారుకులపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని చెప్పారు. జూన్ 4వ తేదీన ఎలక్షన్ కౌంటింగ్ నేపథ్యంలో శాంతియుతంగా ఉండాలని హితవుపలికారు. సమావేశంలో ఎస్‌ఐ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడొద్దు

మార్కాపురం: మార్కాపురం పట్టణ, రూరల్ పరిధిలో ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం తన చాంబర్‌లో మార్కాపురం రూరల్, టౌన్ పరిధిలోని వివిధ పార్టీల నేతలతో శాంతి సమావేశం నిర్వహించారు. జూన్ 4న కౌంటింగ్ జరగనుందని ఫలితాలు వచ్చిన తరువాత ఎవరైనా అల్లర్లకు, దౌర్జన్యాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. గెలుపెవరిదైనా శాంతియుతంగా వ్యవహరించాలని, సంయమనం పాటించాలని, ప్రశాంతమైన వాతావరణాన్ని కొనసాగించాలని చెప్పారు. వాట్సప్‌ల్లో, సోషల్ మీడియాల్లో వదంతులు వ్యాప్తి చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో గొడవలకు పాల్పడిన పలువురిపై నిఘా పెట్టామని చెప్పారు. సమావేశంలో రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణానికి సహకరించాలి

బేస్తవారిపేట: గ్రామాల్లో రాజకీయ నాయకులు గొడవలను ప్రోత్సహించవద్దని, శాంతియుత వాతావరణానికి సహకరించాలని కంభం సీఐ రామకోటయ్య, ఎస్సై నరసింహారావు కోరారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రాజకీయ పార్టీల నాయకులు, బూత్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలు ముగిశాయని, ఎటువంటి రెచ్చగొట్టే మాటలు మాట్లాడుకోవద్దని, అందరు కలిసిమెలిసి ఉండాలని సూచించారు. రాజకీయ కక్షలు పెట్టుకుని గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఆవేశంలో తీసుకునే నిర్ణయాలతో కుటుంబాలు ఇబ్బంది పడుతాయని హెచ్చరించారు.

కౌంటింగ్ తర్వాత ప్రశాంతంగా ఉండాలి

పొదిలి: ఎన్నికల ఫలితాల అనంతరం కూడా గ్రామాల్లో ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ప్రశాంతంగా ఉండాలని ఎస్సై కోటయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని ఏలూరు, సల్లూరు గ్రామాలను ఆమన సందర్శించి స్థానికులతో మాట్లాడారు. పోలింగ్ అనంతరం ఎంత ప్రశాంతంగా ఉన్నారో, కౌంటింగ్ తర్వాత కూడా అంతే ప్రశాంతంగా ఉండాలని స్పష్టం చేశారు. ఏదైనా తగాదాలు, వివాదాలు జరిగే అవకాశం ఉంటే ముందుగానే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులను కోరారు.

హైవేపై చప్టాకు మరమ్మతులు


శుక్రవారం చప్టాకు మరమ్మతులు చేస్తున్న కూలీలు

సాక్షి ఎఫెక్ట్..

కంభం: స్థానిక వై జంక్షన్ సమీపంలో అనంతపురం–అమరావతి హైవే రోడ్డుపై తరచూ చప్టా కుంగిపోతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఈనెల 16న ‘నేషనల్ హైవేపై తరచూ కుంగుతున్న చప్టా’ శీర్షికన సాక్షిలో ప్రచురించిన కథనంపై హైవే అధికారులు స్పందించారు. శుక్రవారం కుంగిపోయిన చప్టాను తొలగించి కొత్త చప్టాను నిర్మించారు. చప్టా నిర్మించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేసిన అధికారులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీకృష్ణ యాదవ సత్రం అభివృద్ధికి కృషి


సత్రం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న యాదవ సంఘం నాయకులు

మార్కాపురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెలుగొండ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో శ్రీకృష్ణ యాదవ సత్రం అభివృద్ధికి కృషి చేస్తానని సత్రం గౌరవ అధ్యక్షుడు సాధం వీరయ్య తెలిపారు. శుక్రవారం పట్టణంలోని వీరయ్య కార్యాలయంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా భోజనశాల, తారురోడ్డు నుంచి కళా మందిరం వరకు సీసీ రోడ్డు నిర్మాణం, సత్రం ఆవరణలో సిమెంటు కాంక్రీటుతో బెడ్ వేయించడం, వంట గది నిర్మాణం, పేద యాదవులకు సహకారం అందించడంపై చర్చించినట్లు వివరించారు. ప్రతి శనివారం సత్రం ఆవరణలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. త్వరలో కొనకనమిట్ల, తర్లుపాడు, మార్కాపురం, పొదిలి, విజయవాడ ప్రాంతాల్లో పర్యటించి దాతల సహకారంతో వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు బొరిగొర్ల బాలయ్య, ప్రధాన కార్యదర్శి గుమ్మా రాజేంద్రప్రసాద్, కోశాధికారి పాడతరపు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కాశయ్య యాదవ్, సహాయ కార్యదర్శి ఎస్.ప్రసాద్‌యాదవ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీమాత జయంతి


ప్రత్యేక అలంకారంలో వాసవీమాత


పారాయణం చేస్తున్న మహిళా భక్తులు

మార్కాపురం టౌన్: వాసవీమాత జయంతి సందర్భంగా మార్కాపురం పట్టణంలోని రాజాజీ వీధిలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 5 గంటల నుంచి ఆలయ అర్చకుడు జొన్నభట్ల రాముశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు.

సాయంత్రం 6 గంటలకు బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో లలిత త్రిపురసుందరీదేవీ అలంకరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, కార్యదర్శి ఎస్‌వీ సుబ్బారావు, కోశాధికారి రామడుగు రమేష్ కమిటీ సభ్యులు, ఉభయదాతలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రశాంతంగా ఏపీఈఏపీసెట్ పరీక్షలు


పరీక్షకు హాజరైన విద్యార్థులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని డాక్టర్ సామ్యేల్‌జార్జి, కిట్స్ కళాశాలలో ఏపీఈఏపీ సెట్ పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పరీక్షలు నిర్వహిస్తోంది. గురువారం, శుక్రవారాల్లో బైపీసీ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా శనివారం నుంచి ఎంపీసీ విభాగానికి పరీక్షలు నిర్వహించనున్నారు. కాగా, జార్జి కళాశాలలో పరీక్ష రాసే దూర ప్రాంతాల విద్యార్థుల కోసం కాలేజీ ఆధ్వర్యంలో ఉచిత బస్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి ఆదిమూలపు విశాల్ తెలిపారు. మార్కాపురం నుంచి వివిధ పరీక్ష కేంద్రాలకు బస్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బేస్తవారిపేట ప్రాంతం వారు పుష్పకుమార్ 73866 26904, వెంకటేశ్వరరావు 84999 82123ను సంప్రదించాలని సూచించారు. మార్కాపురం టౌన్ నుంచి ఉదయం 8 గంటలకు, మధ్యాహ్నం 1.30 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్‌సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

పశ్చిమ ప్రకాశంలో మోస్తరు వర్షం


గొట్లగట్టు వద్ద పొలాల్లో చేరిన నీరు


కొమరోలు : కొమరోలులో చల్లబడిన వాతావరణం

కొనకనమిట్ల/కొమరోలు: ద్రోణి ప్రభావంతో పశ్చిమ ప్రకాశంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. రెండు రోజులుగా కురుస్తున్న జల్లులతో భూములు పదునెక్కాయి. శుక్రవారం కొనకనమిట్ల మండలంలోని పలు గ్రామాల్లో పదును వర్షం పడింది. గొట్లగట్టు, చినమనగుండం, పాతపాడు, బచ్చల కూరపాడు లోతట్టు పొలాల్లో వర్షం నీరు చేరింది. కొమరోలు మండలంలో శుక్రవారం వాతావరణం ఒక్కసారిగా చల్లబడి ఆకాశం మేఘావృతమైంది.

ఉపాధి హామీ పనులపై దృష్టి సారించండి

- డ్వామా పీడీ అర్జునరావు


మాట్లాడుతున్న అర్జునరావు

మార్కాపురం రూరల్: ఉపాధి హామీ పనులపై సిబ్బంది దృష్టి సారించాలని డ్వామా పీడీ అర్జునరావు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఫారం పాండ్‌లు, ప్లాంటేషన్‌తోపాటు కొత్త పనులపై దృష్టి సారించాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు ఉపాధి హామీలో పనులు కల్పించాలని ఆదేశించారు. టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు నిబద్ధతతో పనిచేసి గ్రామాల్లో పనులు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ చందన, ఏపీడీలు పాల్గొన్నారు.

వై.పాలెంలో వైఎస్సార్ సీపీ హ్యాట్రిక్

యర్రగొండపాలెం: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ హ్యాట్రిక్ సాధించనుంది. పార్టీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గ ప్రజలు జగనన్నకు మద్దతు తెలుపుతూనే ఉన్నారు. 2009లో నియోజకవర్గం ఎస్సీకి రిజర్వు చేశారు. వైఎస్సార్ పిలుపు మేరకు రైల్వే శాఖలో ఉన్నత ఉద్యోగ బాధ్యతలు చేస్తున్న డాక్టర్ ఆదిమూలపు సురేష్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగారు. వైఎస్సార్‌పై ఉన్న అభిమానంతో సురేష్ రాజకీయలకు కొత్త అయినా ఆయనకు నియోజకవర్గ ప్రజలు ఆదరాభిమానాలు చూపి 13,194 ఓట్ల మెజార్టీతో గెలిపించారు. ఆ నాటి రాజకీయ పరిణామాలతో వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. పార్టీ ఆవిర్భాం తర్వాత జరిగిన ఎన్నికల్లో 2014లో వచ్చిన సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన పాలపర్తి డేవిడ్‌రాజును ప్రజలు ఆదరించడంతో పాటు 19,071 ఓట్ల మెజార్టీతో గెలిపించారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు సంతలో పశువులను కొన్నట్లు ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారు. ఈ పరిస్థితుల్లో డేవిడ్‌రాజు పార్టీ ఫిరాయించి అధికార పార్టీ టీడీపీలో చేరారు. సంతనూతలపాడు ఎమ్మెల్యేగా ఉన్న ఆదిమూలపు సురేష్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కార్యకర్తలకు అండదండగా నిలిచారు. 2019లో ఆయనకే వైఎస్సార్ సీపీ టికెట్ దక్కడంతో ఆ పార్టీ అభ్యర్థిగా పోటీలో నిలిచారు. ఈ ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు 31,632 ఓట్ల మెజార్టీతో గెలిపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదిమూలపు సురేష్‌కు రెండు పర్యాయాలు కీలక మంత్రి పదవులు ఇచ్చి నియోజకవర్గ ప్రజలను గౌరవించారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తిచేయించి జాతికి అంకితం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశలో నడిపేందుకు నిధులను కేటాయించారు. పుల్లలచెరువు మండల ప్రజలకు తాగు, సాగు నీటి వసతి కల్పించేందుకు తీగలేరు–5 కాలువకు రూ.32 కోట్ల నిధులకు అడ్మినిస్ట్రేషన్ అనుమతులు ఇచ్చారు. గ్రామ, వార్డు సచివాలయాలు, హెల్త్ క్లీనిక్‌లు, రైతు భరోసా కేంద్రాలతో ప్రతి పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసి ఆ పల్లె ముంగిటకు పాలనను తీసుకెళ్లారు. నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల వైద్యశాలను నిర్మించారు. నవరత్నాల పథకాలను అమలు పరిచి కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా నియోజకవర్గంలో 2,05,334 మంది ఓటర్లు ఉంటే దాదాపు 1.80 లక్షల మందికి లబ్ధి చేకూర్చారు. అనేక అభివృద్ధి పనులతో నియోజకవర్గం ముందుకు సాగుతున్న తరుణంలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా తాటిపర్తి చంద్రశేఖర్‌ను పోటీలో దించారు. ఈ నెల 13న జరిగిన పోలింగ్‌లో గతంలో ఎప్పుడూ లేని విధంగా మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు పాల్గొన్నారు. దీనిని బట్టి చూస్తే వైఎస్సార్ సీపీ అభ్యర్థి చంద్రశేఖర్‌కు భారీ మెజార్టీ ఇచ్చి గెలిపించుకుంటున్నారని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చూడాలన్న కసితో ఓట్లు గుమ్మరించారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. దీంతో నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హ్యాట్రిక్ సాధిస్తుందని వారు వ్యాఖ్యానిస్తున్నారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి తెలిపారు. జూన్ 7వ తేదీ వరకు ఉదయం కథలు చదివి వినిపంచడం, 8.30 గంటలకు గేమ్స్, స్పోర్ట్స్, 9.40కి పుస్తక సమీక్ష, 10 గంటలకు చదవడం మాకిష్టం, 10.30 గంటల నుంచి స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్, డ్యాన్స్, చెస్, క్యారమ్స్ నేర్పిస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బూచేపల్లి గెలుపుపై చర్చలు

దొనకొండ: మండలంలో అన్ని గ్రామాల్లో బూచేపల్లి శివప్రసాదరెడ్డి భారీ మెజార్టీతో గెలవబోతున్నారంటూ చర్చలే చర్చలు. నలుగురు కూర్చున్న చోట ఎన్నికల గెలుపు సందడే.. సందడి.. 2004లో బూచేపల్లి సుబ్బారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొంది అన్ని గ్రామాల అభివృద్ధి చేశారు. ఆయన చేసిన అభివృద్ధి ప్రజలు ఎవరూ నేటికీ మరిచి పోలేదు. 2009లో బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత ఆయన తండ్రి బాటలో నడిచి గ్రామాల అభివృద్ధి తమ లక్ష్యంగా పని చేశారు. బూచేపల్లి కుటుంబం అంటే.. దానధర్మాలు చేసే కుటుంబం. చేతితో పెట్టే వారే కానీ తీసుకునే వారు కాదు. ఇంటి దగ్గరికి ఎవరు వెళ్లినా బంగారు చిరునవ్వుతో పలకరించి సమస్యలు తీరుస్తారు. ఆకలితో ఉన్న వారిని గమనించి అన్నం పెడతారు. దాన ధర్మాలకు కేరాఫ్ బూచేపల్లి కుటుంబం. గుడులకు, గోపురాలకు, శుభ కార్యాలకు విరాళాలు అందిస్తుంటారు. గ్రామాల్లో తిరునాళ్లకు అన్నదానం చేస్తారు. ఏ గ్రామం వెళ్లినా ఎవరిని అడిగినా శివప్రసాదరెడ్డి అధిక మెజార్టీతో గెలుస్తున్నారని ధైర్యంగా చెప్తున్నారు. మండలంలో వైఎస్ఆర్ సీపీ ప్రథమ, ద్వితీయ శ్రేణి నాయకులు రాత్రింబవళ్లు కష్టపడి శివన్న గెలుపునకు కృషి చేశారు. ఐక్యంగా విభేదాలు లేకుండా పని చేశారు. ఇంతగా దర్శి నియోజకవర్గ ప్రజలతో మమేకమైన శివప్రసాదరెడ్డి గెలుపు తథ్యమంటూ ఆనందంగా చెప్పుకుంటున్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మోత్సవాలు

కొమరోలు: స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి నగర సంకీర్తన, అభిషేకాలు నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామికి ఆలయ ధర్మకర్త పసుపులేటి రమణయ్య ఆధ్వర్యంలో పూజలు, భజనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ చేశారు.

వ్యర్థాలు లేకుండా చూసుకోవాలి

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలో డెయిరీ ఫాంలు నిర్వహిస్తున్న పశుపోషకులు వ్యర్థాలు ఎక్కువగా లేకుండా చూసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి బేబీరాణి తెలిపారు. మండలంలోని శివరామపురంలో శుక్రవారం పశుపోషకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో డెయిరీ ఫాంలు నిర్వహిస్తున్న రైతులు, పశుపోషకులు వ్యర్థాలను ఎక్కువ రోజులు నిల్వ ఉంచడం వలన మురుగు పెరిగి వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. వర్షాలు పడిన సమయంలో మురుగు నీటిలో దోమలు ప్రబలి జ్వరాలు వస్తాయని చెప్పారు. ఎప్పటికప్పుడు వ్యర్థాలను దూర ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు. అనంతరం పలు డెయిరీ ఫాంలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో పశువైద్యశాఖ సహాయ సంచాలకులు పురుషోత్తంరాజు, సీతఓట కాలేషావలి, డీడీ రమేష్‌బాబు, పశువైద్యాధికారులు వెన్నా ప్రతాప్‌రెడ్డి, బ్రహ్మయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

22న శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కొండ మీద శ్రీలక్ష్మీ నరసింహస్వామి తిరునాళ్ల మహోత్సవం ఈ నెల 22వ తేదీ నుంచి అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు దప్పిలి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22వ తేదీ స్వామి వారి కల్యాణ మహోత్సవం, 23న విజయవాడకు చెందిన నృత్య కళాకారులతో ప్రదర్శన, 24 అగ్గిసేవ,గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.